**తెల్లమబ్బులు, నీలిమబ్బులు కబాడీ ఆడుతున్నాయి. ఎంపైరింగ్ చేస్తున్న సంధ్య ఒంటరిగా, దీనంగా కూర్చున్న లేత రోజారంగు మబ్బువంక జాలిగా చూసింది.**

## పేషెంట్ చెప్పేకథలు

## విరిగిన కెరటం



జలాది విజయలక్ష్మి

పిల్లలంతా అరుస్తూ, కొట్టుకుంటూ, నవ్వుతూ, కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. ఒకవైపు కోకో. ఒకవైపు గోలీలు, మరోవైపు క్రికెట్, ఇంకోవైపు లాంగ్ జంప్, హైజంప్, హాపింగ్, ఉత్సాహం వెల్లువై ప్రవహిస్తోంది మైదానమంతా.

ఈ ఉరవడిని ఉత్సుకంగా గమనిస్తున్నాయి రెండు కళ్ళు నర్సింగ్‌హోమ్ వరండాలో నిలబడి అదే చూస్తున్నాడు గోపి. లోతుకుపోయిన అతని కళ్ళు వుండుండి తళుక్కుమంటున్నాయి. ఉద్వేగపు కెరటాలు విరిగి పడుతున్నాయతని చిన్నారి గుండెలో. అతని కాళ్ళు వేగంగా పరుగెట్టటానికి ఉద్రేకపడుతున్నాయి. అతనిచేతులు క్రికెట్ బంతిని గట్టిగా విసరడానికి, తనయీడు పిల్లలతో ద్వంద్వ యుద్ధం చెయ్యడానికి తహతహలాడుతున్నాయి అతని శరీరంలోని ప్రత్యణువు ఆ పిల్లల్లో ఒకడుగా కలిసి మిగతా లోకాన్ని మరిచి హాయిగా ఆనందించడానికి తపించిపోతూంది.

కాని.... ఊహ తెచ్చిన ఉద్రేకాన్నే తట్టుకోలేని అతని గుండెగోడలు బలంగా ప్రకంపిస్తున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీవ్రమయాయి. కాళ్ళు శక్తిలేనట్లు ఊగసాగాయి. చేతులు వాలిపోయాయి శరీరమంతటా చిరుచెమట అలముకుంది, కోపం బాధ, దుఃఖం, తనముందున్న దృష్టాన్నాన్ని తినలేని అశక్తత....

"గోపీ!" బయట పిల్లల్ని, అతన్ని గమనిస్తున్న శ్రుతి మెత్తగా పిలిచింది. బలవంతాన శక్తిని కూడదీసుకుని వరండా క్రిందకు గెంతబోయిన గోపి పట్టుబడిన దొంగలా ఆగిపోయాడు

"పడుకుని వుండాలని చెప్పానుకదా, ఎక్కడికటు?" మందలింపుగా చూసింది శ్రుతి.

"కొంచెంసేపు ఆడుకుంటా నమ్మగారూ! ఈ ఒక్కరోజు, ఒక్క పావు గంట, ఇంకెప్పుడూ అడగను."

ఆశగా అడిగాడు గోపి. లేడిలా తను పరుగెత్తిన రోజులు, చకచకా చెట్లెక్కి జామకాయలు కోసుకుతిన్న క్షణాలు, గొర్రెపొట్టేళ్లా తన స్నేహితులతో తలపడి కొట్లాడిన సమయాలు గుర్తుకొచ్చాయి గోపీకి.

చెమ్మగిల్లిన శ్రుతికళ్ళు గోపీలాంటి లక్షలాది నిర్భాగ్య బాలల్ని అవలోకిస్తున్నాయి. తొలకరి జల్లులో హసిస్తున్న ఇంద్రధనుస్సులా, వెన్నెల చాందినీపై పొరాడుతున్న తుషార బిందువులా ఆహ్లాదంగా గడిచిపోవలసిన వారి బాల్యం ఒక భయంకరమైన స్వప్నంలా మారుతూంది. సరదాగా, హుషారుగా, ఈ లోకంలోని కష్టాల్ని, పళ్లాల్ని గమనించకుండా 'కొండల్ని పిండి చేస్తాం' అన్నంత ధీమాగా వుండవలసిన పిల్లలు ఈ 'రుమాటిక్ హార్ట్ డిసీజ్'వల్ల నిస్పృహతో, నిరాశతో, నిస్సత్తువతో క్రుంగిపోతున్నారు.

అనారోగ్యపు పంజరాల్ని ఛేదించుకొని రెక్కలు విప్పుకున్న శ్వేత కపోతంలా ఎగిరిపోవాలనే గోపీ ఆరాటాన్ని చూస్తూంటే కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ భానో, ఆయన యూనిట్‌లో తను హౌస్‌సర్జన్‌గా పనిచేస్తున్నప్పటి ఓ సంఘటన గుర్తుకొచ్చింది శ్రుతికి. "ఇన్నాళ్ళనుంచీ ఎందుకు తీసుకురావడంలేదీ అమ్మాయిని? ఎప్పటికప్పుడు చెకప్‌కి తీసుకొచ్చి మందులు వాడితేనేకాని జబ్బు తగ్గదని చెప్పానుకదా!! మళ్ళీ ముంచుకు వచ్చాక తీసుకొచ్చారు" ఓ.పి.లో డాక్టర్ భానోకి ఎదురుగా కూర్చుని మరో పేషెంట్ వివరాలు వ్రాస్తున్న శ్రుతి తలెత్తి ఆ అమ్మాయివంక చూసింది. అర్భకంగా, అమాయకంగా వున్న ఆ అమ్మాయి బేలగా చూస్తూంది.

"ఏం చెయ్యమంటారయ్యా? హాస్పిటల్‌కి రావాలంటే ఒక రోజు పని మన్నా. మాపటేళకు నాలుగు డబ్బులు తెస్తేగాని కడుపునిండని బతుకులు" విచారంగా చెప్పాడా పిల్ల తండ్రి. ఈ కటువైన వాస్తవం డాక్టర్ భానోకి తెలుసు. అతను పైకి చెప్పని మరో కారణం కూడా డాక్టర్‌కి తెలుసు. గుండెజబ్బుల డాక్టర్ గారి దగ్గరకు పిల్లను పదిసార్లు తీసుకెళితే జబ్బు సంగతి అందరికీ తెలిసి పిల్లకు పెళ్ళవదేమోనని భయం.

"గచ్చాకు పుచ్చాకు వైద్యంతో కొంత కాలం. డాక్టరుకు చూపించకుండా మెడికల్ షాపులో తెచ్చుకున్న బిళ్ళలు వాడి కొంత కాలం జరిపేశారు. తరువాత డాక్టర్ దగ్గరకు వెళ్ళినా అతను వ్రాసిన మందులు ఫుల్ కోర్స్ వాడలేదు. గొంతు నొప్పి, జ్వరంతో మొదలయిన వ్యాధి గుండె జబ్బుగా మారాక యిక్కడకు వచ్చారు. యిక్కడ పూర్తి ట్రీట్‌మెంట్ తీసుకోవడానికి, ఎప్పటికప్పుడు చెకప్‌కి రావడానికి ఎన్నో వ్యక్తిగతమైన సాంఘికమైన అవరోధాలు." ఈ వ్యాధికి ఎరవుతున్న పిల్లల్ని గురించి చెప్తున్న డాక్టర్ భానో కళ్ళల్లో ఆందోళన. ఆవేదన కదిలింది. శాస్త్ర పరిశోధనకు, వృత్తికి అంకితమై విజ్ఞాన జ్యోతిలా భాసించే డాక్టర్ భానోదగ్గర పనిచేయడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్న హౌస్ సర్జన్లు ముగురూ తమ మనసుల్లోని సందేహాలు బయటపెట్టారు తమ సందేహాల్ని తీరుస్తూ ఆయన చెప్పింది గుర్తుకొచ్చి శ్రుతి గుండె భారంగా అయింది.

## పురుషానందం

అరటిపండు అతివ
చీరలు వొలిచెయ్యడమంటే
ఎంత ఆనందం ఈ ప్రేళ్ళ
మగవాళ్ళకు!

— పద్మావతి సనారా

"దయనీయమైన విషయమేమంటే ఉత్పత్తి కార్యక్రమాల్లో చురుగ్గా తమవంతు పాత్రను నిర్వహించాల్సిన లక్షలాది యువతీ యువకులు తమ జీవితంలో ఏ సుఖానికీ, సంతోషానికీ నోచుకోని దురదృష్టవంతులవడమే కాకుండా కుటుంబానికీ, దేశానికీ భారంగా తయారవుతున్నారు. బ్రతుకు అందించే ఎన్నో ఆనందాల్నుంచి వంచితులవుతున్నారు. దాంపత్య జీవితం గడపడానికి, గర్భవతి అవడానికి అర్హతలేని ఇలాంటి పిల్లల్ని చూస్తూంటే ఎలా ఈ భయంకరమైన సమస్య పరిష్కరింపబడుతుంది అన్న ఆవేదన కలుగుతుంది. రోజు రోజుకూ అస్తవ్యస్తంగా తయారవుతున్న దేశ పరిస్థితుల్ని గమనిస్తూంటే, కేన్సర్ కణాల్లా అత్యంత వేగంగా పెరిగిపోతున్న దారిద్ర్యాన్ని చూస్తూంటే యిప్పట్లో ఈ సమస్య పరిష్కరింపబడదేమోనన్న నిరాశ ఆవరిస్తుంది." డాక్టర్ భానో మంద్ర గంభీర స్వరం వినిపిస్తున్నభావన కలిగింది శ్రుతికి.

"ఇక్కడున్నావంటరా? నీకోసం యిందాకటి నుంచి వార్డంతా వెతుకుతున్నాను. రా. పడుకుందువుగాని." గోపీ తల్లి కంఠం వినిపించి స్వప్నం నుంచి బయటపడింది శ్రుతి.

"వదులు నే నాడుకోవాలి.. చచ్చిపోతే చచ్చిపోతాను.... హాయిగా ఆడుకుని మరీ చచ్చిపోతాను.... ఎప్పుడూ పడుకో పడుకో, ఈ మాట వినీ వినీ విసుగెత్తిపోయింది నాకు. పడుకుని, పడుకుని పిచ్చెక్కిపోతుంది. ఆ వార్డునీ, మంచాన్నీ చూస్తూంటే పెట్రోలుపోసి తగలబెట్టాలనిపిస్తోంది —నేనింక పడుకోలేను, వదులు నన్ను." ఉద్రేకంగా అరుస్తూ, గింజుకుంటూ తల్లి పట్టుని విడిపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు గోపి.

"గోపీ!" గోపీ భుజంచుట్టూ చెయ్యేసి దగ్గరకు లాక్కుంది శ్రుతి. ఆమె స్పర్శతో అతని ఉద్రేకం నెమ్మదిగా చల్లబడసాగింది.

"నీ జబ్బు నయమవాలని నీకుందా లేదా చెప్పు? నీ ఆరోగ్యం బాగుపడ్డాక చక్కగా ఆడుకుందువుగాని. ఇప్పుడు లోపలకు వెళ్ళు. రెస్ట్ తీసుకో." మృదువుగా శాసించింది శ్రుతి. రెక్కలు తెగిపడిన పక్షిలా, కాళ్ళు నరకబడ్డ కుందేలు పిల్లలా శ్రుతి వంక చూశాడు గోపి.

(ప్రసిద్ధ "కార్డియాలజిస్ట్" ప్రొఫెసర్ బ్రహ్మజీ రావుగారికి అభివాదాలతో.)




## ప్రపంచ యాచకులారా ఏకంకండి!

జయపూర్‌లో ఇటీవల యాచకులంతా కలిసి సభ చేసి ఒక సంఘాన్ని కూడా స్థాపించుకుని "ప్రపంచ యాచకులారా ఏకం కండి" అని పిలుపునిచ్చారు. ఆ సంఘానికి కేరళకు చెందిన కెన్నా ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. "యాచించి కుటుంబాల్ని పోషించుకునే వారి సంఘం మనది. ఇది కూడా అన్ని వృత్తులలాగే ఒక వృత్తి" అన్నాడు ఆ అధ్యక్షుడు.

## తేనెటీగ కళ్ళద్దాలు!

అమెరికాలోని ఫిలడల్ఫియాలో వున్న పెన్సిల్వేనియా కాలేజ్ ఆఫ్ ఆప్టొమెట్రీకి చెందిన డాక్టర్ విలియమ్ పియన్ బూమ్ ఈ "తేనెటీగ కళ్ళద్దాల"ను తయారు చేశాడు. సాధారణంగా వుండవలసిన దృష్టిలో రెండు శాతం మాత్రమే వున్న వారికికూడా చూపు నివ్వగల శక్తి ఈ అద్దాలకు వుంది. వీటిని తేనెటీగ కళ్ళ (తేనెటీగ కన్ను అనేక కళ్ళ సముదాయం!) పద్ధతిలో నిర్మించారు. ఇవి దృష్టి దూరాన్ని, వైశాల్యాన్నికూడా పెంచగలవట!

## డీసిల్ పువ్వులు!

సౌత్ ఆఫ్రికాకు చెందిన కొందరు శాస్త్రజ్ఞులు సుళువుగా, చౌకగా పొద్దు తిరుగుడు పువ్వుల నుంచి డీసిల్‌ను పొందే ప్రక్రియను కనిపెట్టారు. పొలాలలోనే అతి తేలికగా డీసిల్‌ను తయారుచేసే ఈ ప్రక్రియలో గాలన్‌కు 1.75 అమెరికన్ డాలర్లు ఖర్చవుతుందిట.

## మృత్యుంజయుడు

చనిపోయాడనుకున్న వ్యక్తి చితిమంటల మధ్యనుంచి లేచి వచ్చి బంధుమిత్రుల్ని భయపెట్టిన సంఘటన కాన్పూర్‌లో ఇటీవల జరిగింది. రామావతార్ అనే వ్యక్తి రిక్షా కార్మికుడు. రాత్రి బాగా తాగి పడిపోయిన రామావతార్ స్పృహ కోల్పోయాడు. ఊపిరికూడా ఆడలేదు. దాంతో చుట్టుపక్కలవారు అతను చనిపోయాడని నిర్ణయించి అంత్యక్రియలకు ఏర్పాటుచేసి తీరా చితికి నిప్పంటించాక ఆ మృత్యుంజయుడు "బతికి" లేచి బయటకొచ్చాడు!

## అగ్నిపర్వతాల్లో అగ్రస్థానం!

ప్రపంచంలో ఎక్కువ సంఖ్యలో అగ్నిపర్వతాలున్నదేశం ఇండొనేషియా. అక్కడ 128 అగ్ని పర్వతాలున్నాయి. జావా దీవిలో ముప్పై అయిదు, సుమిత్రా దీవిలో మరో ముప్పై ఉన్నాయి. జపాన్, ఫిలిప్పీన్స్ దీవులలో కూడా పెద్ద మొత్తాల్లో అగ్నిపర్వతాలున్నాయి. ప్రపంచంలో పెద్ద అగ్ని పర్వతం లాంబోక్ దీవిలో ఉన్న "రింజని". దీని ఎత్తు రెండువేల ఏడు వందల డబ్భై అయిదు మీటర్లు!

## 'కానిస్టేబుల్ కూతురు!'

"ముదితల్ నేర్వగరాని విద్యకలదే"- అనే విషయంలో సంశయం అనవసరమని ముజఫర్‌నగర్‌కు చెందిన ఒక యువతి ఇటీవల రుజువుచేసింది.

పురుషుల దుస్తులు ధరించి మొరదాబాద్ పట్టణం వివిధ వాడలలో వీరవిహారం చేస్తూ స్థానికులను చితకదన్ని, డబ్బు గుంజుకున్న నేరంపై ఆమెను పోలీసులు అరెస్టు చేశారు.

ఎవరూ "ముద్దార" నేర్పించకపోయినా చౌర్యకళలో ప్రావీణ్యం సాధించిన ఈ యువతి ఒక మాజీ హెడ్ కానిస్టేబుల్ పుత్రికా రత్నం కావడం మరీ విశేషం!

—పరిటాల దుర్గామల్లేశ్వరి